# ది గెస్ట్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## (గత సంచిక తరువాయి)

ఆ రోజు ఉదయం బెనర్జీ ఓచర్స్ చూస్తుండగా ఎవరో తలుపు తెరుచుకుని లోపలికి రావడంతో ప్యూన్ అనుకుని 'టీ తీసుకురా' చెప్పాడు తలెత్తకుండా.

గాజులు చప్పుడవడంతో తలెత్తి చూశాడు. వెంటనే అతని మొహంలో ఆశ్చర్యంతో కూడిన ఆనందం.

"మీరా?" చెప్పాడు "కూర్చోండి మైత్రిగారు. వాట ఎ సర్‌ప్రయిజ్ ఇవాళ గురువారమేనా?" అడిగాడు.

"పూర్తిగా" చెప్పింది నవ్వి.

"పన్నెండో తారీకే నా?"

"ఇంకా పూర్తిగా మీరు బెనర్జీ. నేను మైత్రి. పూర్తిగా. మీరేం కలగనడం లేదు" కూర్చుని చెప్పింది.

టేబుల్ మీద ఉన్న ఖాళీ గాజు గ్లాసులోకి నీళ్ళు జగ్ లోంచి వంచి తనతో తెచ్చిన కాడతో ఉన్న నల్ల గులాబి పువ్వుని ఆ గాజుగ్లాసులోని నీళ్ళలో ఉంచింది.

"ఏస్ప్రిన్ మాత్ర తెప్పించి నీళ్ళలో వేయండి" చెప్పింది.

"నన్ను చూస్తే గులాబీకి కూడా తలనొప్పి వస్తుందా?" నవ్వుతూ అడిగాడు.

"ఆ విషయం గులాబే చెప్పాలి కాకపోతే, ఆ పని చేస్తే ఆలశ్యంగా వాడుతుంది పువ్వు"

"ఇలా వచ్చారు?" అడిగాడు బెనర్జీ.

"మీతో చిన్నపని పడి"

"తప్పకుండా. చెప్పండి" ముందుకి వంగి అడిగాడు.

"కొద్దిగా ఎంబరాసింగ్‌గా ఉంది అడగడం" కొన్ని క్షణాలు మాట్లాడటానికి తికమకపడి చెప్పింది.

"ఫీల్ ఫ్రీ నా దగ్గరెందుకు అలాంటి ఇబ్బంది?

కిటికీ దగ్గర ఎండపడేచోట ఉన్న అత్తిపత్తి మొక్క ఉన్న పూలకుండీని చూసి నవ్వి అడిగింది.

"దాన్ని ఇంకా ఉంచారే?"

"మీ గుర్తుగా"

"చిన్నప్పుడు ఇలాంటి మొక్కలని పెంచి తెగ ఆడుకునే వాళ్ళం" చెప్పింది.

ప్యూన్‌ని పిలిచి కూల్ డ్రింక్ తీసుకురమ్మని చెప్పాడు. కూల్ డ్రింక్ తాగాక అడిగాడు.

"మీరు అసలు విషయం చెప్పనేలేదింకా?"

"మా నాన్నగార్ని చూసారుగా. ఆయనకి ఆస్తమా రాత్రంతా చాలా బాధపడ్డారు. ఇంకా ఆయన పరిస్థితి అలాగే ఉంది."

"అరె పాపం! డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళలేదా?"

"ఆయన పనిచేసేదే డాక్టర్ దగ్గర. ఆయనే స్వయంగా వచ్చి చూసారు. చోటు మారితే కాని తగ్గదని చెప్పారు. చూస్తున్నారుగా ఎంత చలో. కోల్డ్ వేవ్ అందులో."

"నిజమే. ఈ సంవత్సరం చలి ఎక్కువగా ఉంది. ఢిల్లీలో చలికి నలుగురు మరణించారని ఇవాళే పేపర్లో చదివాను"

"మా నాన్నగారు అలా కాకూడదని మీ దగ్గరకి వచ్చాను" ఆశ్చర్యంగా ఆమె వంక చూసాడు బెనర్జీ.

"మీరెందుకు వచ్చారో సగం అర్థం అయింది. మిగతా సగం మీరే చెప్పాలి కాని నేనూహించలేను" చెప్పాడు.

"మాకు బంధువులు లేరు ఎక్కడా. ఆయన్ని ఓ నెలన్నరపాటు విజయవాడలో ఉంచాలనుకుంటున్నాం. ఇల్లు తీసుకోవాలి. అందుకు తగ్గ.." ఆగి కొద్దిగా సిగ్గుపడూతూ పూర్తిచేసింది. "ఆర్థిక శక్తి మాకు లేదు"

"ఇప్పుడు పూర్తిగా అర్థం అయింది మీకు అప్పు కావాలంటారు. అంతేనా?" అడిగాడు బెనర్జీ.

తల ఊపింది.

"ఎంత?"

"మూడువేలు. నాన్నగారితో పాటు ధాత్రి కూడా వెళుతుంది. ఇద్దరు నెలన్నరదాకా రాకపోవచ్చు"

"రేపు ఉదయం బేంక్‌కి వెళ్ళి తీసుకోండి. టైమైపోయిందివాళ"

బెనర్జీ డ్రాయర్ లోంచి చెక్ బుక్ తీసి చెక్ రాసి ఆమెకి ఇచ్చి చెప్పాడు.

"థాంక్స్" దాన్ని ఓ కవర్లో ఉంచి బెనర్జీ ఇస్తే తీసుకుని చెప్పింది.

"వెల్ కం" చిరునవ్వుతో చెప్పాడు.

"సాధ్యమైనంత త్వరలో తిరిగి ఇచ్చేస్తాను"

"డోంట్ బాదర్"

"వెళ్ళొస్తాను"

లేచి గుమ్మందాకా వెళ్ళాక అడిగాడు బెనర్జీ ఆమెని.

"మీ నాన్నగారిని ఎప్పుడు పంపుతున్నారు?"

"రేపే"

"రేపు సాయంత్రం మనం కలుస్తున్నామా? కలసి భోంచేద్దాం"

కొద్ది క్షణాలపాటు ఆమె మొహంలో సందేహం కదులాడింది. తర్వాత నెమ్మదిగా చెప్పింది.

"అలాగే"

అవసరం ఏ మనిషినయినా బానిసచేస్తుంది, అన్న సంగతి గుర్తొచ్చింది బెనర్జీకి. తనీ సహాయం చేయకపోతే గతంలోలా ఉండేది. ఇప్పుడు తను మైత్రి మీద ఆధిక్యతని సంపాదించుకున్నాడు. నో అనలేదు.

ఇనుముని వేడిగా ఉన్నప్పుడే కావాల్సిన విధంగా మలచాలి.

"గుడ్ అయితే రేపు సాయంత్రం ఏడున్నరకి కలుద్దామా!"

ఎక్కడో చెప్పాడు.

"అలాగే. థాంక్ యు అండ్ గుడ్ బై"

మర్నాడు రాత్రి ఏడున్నరకి బెనర్జీ కారు చెప్పిన చోట ఆపాడు. తెల్లటి చీరలో, బస్ స్టాప్‌లో నిలబడ్డ ఆ అమ్మాయిని చూసి గట్టిగా పిలిచాడు. "మైత్రి"

వెంటనే ఆ అమ్మాయి బెనర్జీ పక్కన కూర్చుంది.

"చాలా సేపయిందా వచ్చి?" అడిగాడు కారుని పోనిస్తూ.

"జస్ట్ ఫైవ్ మినిట్స్"

"మీరు వెజిటేరియనా, నాన్ వెజ్ కూడా తింటారా?" అడిగాడు.

"రెండూ" జవాబు చెప్పింది.

కారుని ఓ ఖరీదయిన బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర ఆపాడు. కారు పార్క్ చేశాక అతని వెంట లోపలికి నడిచింది. ఎంతో విశాలమయిన హాలు. ఏ.సి. చేయబడటంతో చల్లగా ఉంది. పైనుంచి వేలాడే షేండ్‌లియర్లు. ఖరీదయిన ఫర్నిచర్. కొందరు తాగుతూండటం చూసి అది బార్‌గా గుర్తించింది.

కూర్చున్నాక అడిగింది.

"ఇది బారా?"

"అవును"

"ఇలాంటి చోట్లకి ఆడవాళ్ళు వస్తారా?" విస్మయంగా అడిగింది.

"తప్పులేదు. ఇది ఫేమిలీ సెక్షన్. ఇక్కడికి వచ్చే వాళ్ళంతా డిగ్నిఫైడ్ గా ఉంటారు. అల్లరి చిల్లర వ్యవహారాల వాళ్ళు రారు"

"మీరు తాగుతారా?" అడిగింది.

"అప్పుడప్పుడు. మీ కభ్యంతరమా?"

"తాగి ఇంటికెలా వెళ్ళగలరు?"

"కారులో"

"అదే కారెలా డ్రైవ్ చేయగలరు?"

చిన్నగా నవ్వాడు బెనర్జీ.

"హద్దుమీరి నేనెపుడూ తాగను. నిజానికి తాగాకే కారు ఇంకాస్త ఫర్‌ఫెక్ట్‌గా డ్రైవ్ చేయగలను"

అదంతా ఆమెకో కొత్తలోకంలో ఉంది. ఖరీదయిన గ్లాసులూ, యూనిఫాంలో స్మార్ట్‌గా ఉన్న వెయిటర్స్. సూట్స్ వేసుకున్న స్టివార్డులు. మంద్రంగా వినపడే వెస్టర్న్ మ్యూజిక్. కాలికింద మెత్తని తివాచి. కాన్వెంట్‌లో చదివే తమ చిన్నపిల్లలతో ఇంగ్లీషులో మాట్లాడే తల్లులు, కుటుంబం అంతా వచ్చి సరదాగా మాట్లాడుకుంటూ భోజనం చేయడం.

"తినడానికి ఇన్నిరకాల పదార్థాలుంటాయని నాకు తెలీదు" భోజనానికి ఇచ్చిన పదార్థాలని చూసి చెప్పింది.

బెనర్జీ నవ్వి చెప్పాడు.

"మీ ఫ్రేంక్‌నెస్ నాకు మొదటి నుంచీ నచ్చుతోంది. నిజమే. ఎప్పుడూ ఇంట్లో తినే చాలామందికి తెలీదు చికెన్‌తో, మటన్‌తో ఇన్ని రకాలుగా వండవచ్చని"

"మనం తినేదాన్ని ఏమంటారు?" అడిగింది.

"కాష్మీరి కబాబ్. ఇందాక తిన్నది చికెన్ టిక్కా, ఇప్పుడు రాబోయేది వెస్టర్న్ డెలికసీ, చికెన్ సిజ్లర్"

ఆమెకి అక్కడి వాతావరణం, పద్ధతులు, భోజనం ఎంతో నచ్చాయి. బ్రాందీ తాగుతున్న బెనర్జీలో అట్టే తేడా కనపడలేదు మాటల్లో. తూలడంలాంటివేం లేవు.

"ఇది చైనీస్ వంటకం. చికెన్ నూడుల్స్ సాఫ్ట్" చెప్పాడు.

ఆఖరుగా ఐస్క్రీం ఆర్డర్ చేసాడు.

బిల్లు చూసి ఆశ్చర్యపోయింది. తన తండ్రి నెలజీతం కన్నా ఎక్కువ. ఏడువందల నలభై రెండురూపాయలు. ఓ చిన్న కుటుంబం నెలంతా గడపడానికి సరిపడే డబ్బు!

క్రెడిట్ కార్డ్ ఛార్జ్ స్లిప్ మీద సంతకం చేసి, ఏభై రూపాయల నోటు టిప్‌గా ఇచ్చాడు బెనర్జీ.

"థాంక్ యు. గుడ్ నైట్ సర్" చెప్పాడు వెయిటర్. అతను మొదటినుంచీ చక్కటి ఇంగ్లీష్ మాట్లాడుతుండటంతో గ్రాడ్యుయేట్ అయివుంటాడనుకుంది.

బయటికి వచ్చి కారెక్కబోయే ముందు వాచ్‌మేన్‌కి అయిదు రూపాయలు టిప్‌గా ఇచ్చాడు బెనర్జీ.

కారు బయలుదేరాక చెప్పింది.

"అదంతా మరో ప్రపంచం"

"ఆ ప్రపంచం గురించి తెలుసుకోవడంలో నష్టంలేదుగా"

బెనర్జీకి అర్థం అయింది తను ఆమెని బాగా ఇంప్రెస్ చేయగలిగానని. డబ్బు ఇచ్చే సుఖం స్వయంగా అనుభవిస్తే కాని, దాని విలువ మనిషికి తెలీదు. కొద్దిగా రుచి చూపించాడు. రేపు మరికాస్త. ఆ తర్వాత ఇంకాస్త. డబ్బువల్ల దొరికే సౌఖ్యాలు అర్థం అయితే మనిషి వద్దనుకున్నా దానికి బానిస అవుతాడు.

"ఏమిటో ఆలోచిస్తున్నారు?" అడిగాడు బెనర్జీ ఆమె మౌనంగా ఉండటంతో.

"విజయవాడలో మా ధాత్రి అద్దె ఇల్లు దొరకగానే ఉత్తరం రాస్తానంది. ఆ సంగతి"

రాత్రి పదకొండు ముప్పావుకి కారు సుబ్బరామయ్య ఇంటి ముందాగింది. ఆమె కారు దిగి గుడ్ నైట్ చెప్పాక చెప్పాడు.

"రేపు ఉదయం ఓసారి ఫోన్ చేయండి"

"అలాగే"

"అలాగే గుడ్ నైట్"

"గుడ్ నైట్"

కారు బయలుదేరాక బెనర్జీకి అనిపించింది తన స్ట్రేటజీ కరక్టే అని. మొదటి రోజే చొరవ తీసుకుంటే మర్నాడు కలవక పోవచ్చు. ఇలాంటి విషయాల్లో స్లో అండ్ స్టెడీ. చివరకి ఈ ఆటలో తను గెలవడమే ముఖ్యంగాని 'ఎంత త్వరగా' అన్నది కాదు. కాని ఆమె కేరక్టర్ గురించి మొదటి నుంచీ తెలిసి ఉండడంతో ఓ మూల అధైర్యం కూడా ఉంది.

మర్నాడు విశ్వానికి చెప్పాడు.

"అసలు ముట్టుకోలేదా?" అడిగాడు తను ఆశ్చర్యంగా.

"లేదు ఊరికే చేతులు పట్టుకుని ప్రయోజనం లేదు. ఐయాం ఎయిమింగ్ మై రైఫిల్ ఫర్ ది బుల్స్ ఐ."

ఆ రోజు అతను ఎదురు చూసినట్లుగా ఫోన్ రాలేదు. సాయంత్రం విశ్వంతో చెప్పాడు.

మైత్రి ఫోన్ చేయలేదు. " పిట్ట చేయిజారిపోయిందేమోనని అనుమానంగా ఉంది నాకు"

"ఆ సంగతి నేను ఉదయమే అనుకున్నాను. తన తండ్రికి ఇష్టంలేని పని ఆయన దూరంగా ఉన్నాసరే చేయదు.

మర్నాడు కూడా ఫోన్ రాలేదు. ఆ సాయంత్రం మైత్రికోసం ఆమె ఇంటికి వెళ్ళాడు. ఇల్లు తాళం వేసి ఉంది. ఏం చేయాలో ఆలోచించాడు.

ఆ మర్నాడు ఉదయం ఆ ఇంటి కాలిగ్ బెల్‌ని నొక్కాడు ఒకతను. తలుపు తెరవగానే అడిగాడు.

"మైత్రిగారు కావాలి"

అతన్ని, అతని చేతిలో సెలోఫెన్ చుట్టిన పూలబొకేని చూసి చెప్పింది.

"నేనే."

"ఇక్కడ సంతకం చేయండి" ఓ స్లిప్ ఇచ్చి చెప్పాడు.

"ఏమిటిది? అడిగింది.

"ఫ్లవర్స్ అండ్ ఫ్లవర్స్ నుంచి దీన్ని మీకు పంపమని బెనర్జీ గారు డబ్బు కట్టారు"

"దీని ఖరీదెంత?" అడిగింది సంతకం చేస్తూ.

"డెబ్బై నాలుగు రూపాయలు ప్లస్ డెలివరీ ఛార్జెస్ ఇరవై రూపాయలు"

అతను వెళ్ళాక ఆ బొకే వంక చూసింది. ఏడు గులాబీలు, ఫెరన్ ఆకులు, మరో నాలుగు రకాల పువ్వులతో ఎంతో అందంగా ఆ బొకే తయారు చేయబడింది. దానికున్న కవర్‌ని పిన్ నుంచి విడదీసి దాన్ని ముందు గదిలో టేబుల్ మీద పెట్టింది. ఆ కవర్‌ని చింపి లోపలి నుంచి ఓ కాగితం తీసింది.

పూర్ణచంద్రుడిలా తెల్లగా ఉన్న ఆ కాగితం మీద ఎలక్ట్రానిక్ టైప్ రైటర్ తో అందంగా మధ్యలో టైప్ చేయబడి ఉన్నాయి మూడు వాక్యాలు.

"మనిషి మానసికంగా డిప్రెస్డ్‌గా ఉన్నప్పుడు అతనికి చిరునవ్వునిచ్చేది ఒకటే. గులాబి. దాన్ని తీసుకురండి"

చాలా సేపటిదాకా ఆ కాగితం వంక చూస్తూ కూర్చుండిపోయింది తర్వాత దాన్ని మడిచి కిటికీలోంచి బయటికి చూసింది.

ఎదురుగా ఆ రోజే విచ్చుకున్న తెల్లగులాబీ కనపడింది.

●●●

బెనర్జీకి ఆమె వచ్చేదాకా అనుమానమే. కాని ఉదయం పదిన్నరకి చేతిలో తెల్లటి గులాబి స్టెమ్‌తో తన గదిలోకి అడుగుపెట్టిన ఆమెని చూడగానే 'అమ్మయ్య' అనిపించింది.

"థాంక్స్ ఫర్ కమింగ్" చెప్పాడతను.

టేబుల్ మీద గాజుగ్లాసులో లేదు నల్ల గులాబి. ఇప్పుడది ఖరీదయిన గ్లాసు బౌల్‌లో ఉంది. దాంట్లో ఉంచింది తెల్ల గులాబి కాదని.

"ఎందుకు డిప్రెస్డ్‌గా ఫీలవుతున్నారు?" అడిగింది.

"మైత్రి. నాకు మీరంటే ఎంతో ఇష్టం. మీరు కనబడకపోతే పిచ్చి వాణ్ణయిపోతున్నానంటే నమ్మండి. నిన్నటికి నిన్న అయిదు వేలు బదులు ఓ చెక్ అయిదు లక్షలకి రాసాను. అకౌంట్‌లో అంత బేలన్స్ లేదు కాబట్టి తిరిగి వచ్చేసింది"

తల వంచుకుంది వెంటనే.

"నేను అబద్దం చెప్పడంలేదు మీ నుంచి చాలా నేర్చుకున్నాను. ఈ పువ్వులు, ఈ మొక్కలు ఎంతో సంతృప్తినిస్తాయి. లేకపోతే ప్రపంచంలో ఇన్ని పార్కులు, ఇన్ని తోటలు ఉండవు. ప్రజలు వాటిల్లోకి వెళ్ళారు. మానసిక ప్రశాంతి చెట్ల మధ్య లభిస్తుంది. కాని నాకు పరిపూర్ణమయిన ప్రశాంతి మీ సమక్షంలోనే, మీరు నమ్మినా నమ్మకపోయినా సరే."

"అర్థం అయింది" చెప్పింది.

"మీతో మాట్లాడాలి" చెప్పాడు.

"మీరిప్పుడు చేస్తున్నది అదేగా" నవ్వింది.

"ఇలా కాదు. ఇక్కడ కాదు."

"ఎప్పుడు? ఎలా?" అడిగింది.

●●●

మర్నాడు ఉదయం మరోసారి ఆలోచించింది తను చేస్తున్న పని రైటేనా అని. తన పరిధిలో ఉన్నంత సేపు సబబే అనిపించింది.

"నాన్నగారు, ధాత్రి తిరిగి వచ్చేదాకా నేను మీకే విషయం చెప్పలేను. వాళ్ళని సంప్రదించాలి" చెప్పింది.

"తప్పకుండా. వాళ్ళ సంగతి మర్చిపోతే మీకేమనిపిస్తోంది?" అడిగాడు.

బదులుగా ఆమె ఓ గులాబిని తెంపి బెనర్జీ చేతికి అందించింది. చల్లారకుండా వెండి గిన్నెల్లో వెచ్చచేస్తూ, అన్ని రకాల పదార్థాలు ఉన్నాయి. ఏది తినాలో, ఏది వదిలేయాలో అర్థం కాలేదు ఆమెకి. దేని రుచి దానిదే

ఆమెని ఇంటి దగ్గర డ్రాప్ చేసి చెప్పాడు బెనర్జీ.

"థాంక్స్ ఎలాట్. గుడ్ నైట్. రేపు కలుద్దాం"

"అలాగే" చెప్పింది.

ఎంతో సాధారణ మధ్య తరగతి జీవితం మాత్రమే తెలిసిన ఆమె ఆ పధ్నాలుగు గంటల్లో ఐశ్వర్యవంతుల జీవితం అనుభవించాక డబ్బుకున్న విలువ ఏమిటో ఇంకాస్త అర్థం అయింది. హోటల్లో, తోటల్లో, కారులో... ఎక్కడయినా సరే తనని ఎంతో గౌరవంగా, ఓ రాణిలా చూసారు.

జీవితాంతం అలా రాణిలా చూడబడడం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. రకరకాల ఆలోచనలతో ఆ రాత్రి ఆమెకి తండ్రి నిద్రమాత్ర సగం వేసుకుంటే కాని నిద్రపట్టలేదు.

"ఏమయింది?" అడిగాడు విశ్వం బెనర్జీని మర్నాడు.

"సగం పైనే సక్సెస్"

"ఇంతదాకా అయిదువేలదాకా తగలేసి ఉంటావు కదా?"

"కొన్ని సరదాలని, సంతోషాలని డబ్బుతో కొలవకూడదు మిత్రమా. బాగా డబ్బున్నప్పుడే ఆ సంగతి అర్థం అవుతుంది" చెప్పాడు బెనర్జీ.

"ఇంతకీ బుల్స్ ఐని ఎప్పుడు కొడుతున్నావ్?" అడిగాడు విశ్వం.

బెనర్జీ ఆ ప్రశ్నకి సమాధానం చెప్పబోయే ముందు కొద్దిసేపు ఆలోచిస్తుండిపోయాడు. తర్వాత చిన్నగా తలతాటించి చెప్పాడు.

"ఇవాళ రాత్రే! ఇవాళ రాత్రే నేను మైత్రిని.. "ఆ వాక్యం పూర్తి చేయకుండా చిన్నగా నవ్వాడు. క్రమంగా ఆ నవ్వు అధికం అయింది.

"ఏమిటంత నవ్వు?" కోప్పడ్డాడు విశ్వం.

"ఎందుకా? మైత్రిని లొంగదీసుకునేందుకు నేను పడ్డ అవస్థకి తలచుకుని కొంత. రాత్రి అందబోయే భోగం తలచుకుని కొంత చెప్పాడు బెనర్జీ.

"గుడ్ లక్" చెప్పాడు విశ్వం.

మర్నాడు ఉదయం బెనర్జీ కాబోయే మామగారు వీరభద్రరావు వచ్చాడు.

వధూవరులిద్దరి జాతకాల ప్రకారం రాయించిన ముహూర్తం కాగితాన్ని బెనర్జీ తండ్రికి చూపించాడు. పసుపు రాసిన ఆ కాగితాన్ని బెనర్జీ కూడా చదివాడు. "సరిగ్గా ముప్పై నాలుగు రోజు మీరంతా మా ఇంటికి ఉదయం భోజనానికి రావాలి" ఆహ్వానించాడాయన.

బెనర్జీ తండ్రి అందుకు ఒప్పుకున్నాడు. ఆయన వెళ్ళాక భార్యతో చెప్పాడు.

"సాయంత్రం బజారెళ్ళి కోడలికి పట్టుచీర, జాకెట్టు కొనుక్కురా. పుట్టినరోజు బహుమతిగా ఇవ్వచ్చు."

ఆ రోజు ఆఫీస్‌కి లేట్‌గా వెళ్ళాడు బెనర్జీ. అప్పటికే మైత్రి అనే అమ్మాయి అతనికోసం రెండుసార్లు ఫోన్ చేసినట్లు చెప్పాడు ఫోన్ ఆపరేటర్.

మూడోసారి దొరికాడు బెనర్జీ.

"ఆలస్యంగా వచ్చారే..? " అడిగింది అవతలినుంచి ఓ కంఠం.

"ఇవాళ రాత్రి మనిద్దరం కలిసి భోంచేద్దాం" చెప్పాడు.

"ఎక్కడ?" అడిగింది.

"క్లబ్‌లో"

"ఏ క్లబ్?"

"సరిగ్గా ఏడింటికి రవీంద్రభారతి మెట్లమీద ఉండు. పికప్ చేస్తాను. ఇవాళ రాత్రి నీకో గుడ్ న్యూస్"

"ఏమిటది?"

"చెపుతాగా"

ఫోన్ పెట్టేశాడు బెనర్జీ.

ఆ రాత్రి ఏడుంపావుకి రవీంద్రభారతి మెట్లముందు కారు ఆపాడు బెనర్జీ.

"హలో" పలకరించాడు ఆమె కూర్చున్నాక.

"ఇవాళ ధాత్రి నుంచి ఉత్తరం వచ్చింది" చెప్పిందామె సంతోషంతో.

"ఏం రాసింది?" అడిగాడు.

"నాన్నగారి ఆరోగ్యం ఈ వారంలో కొద్దిగా బాగుపడిందిట. ఇంకో రెండు మూడు వారాల్లో ఇంకా బాగుపడచ్చు."

"వెరీగుడ్"

"నన్నూ రమ్మని రాసింది"

"వెరీ బేడ్"

"నాన్నగారికి నేను ఒంటరిగా ఉండటం ఎంతమాత్రం ఇష్టం లేదు. ఉద్యోగ ప్రయత్నాలు కుంటుబడతాయని నేనే సర్దిచెప్పాను. ఆరోగ్యం బాగయ్యాక మళ్ళీ ఇప్పుడాయనకి నా మీద బెంగ మొదలైనట్లుంది" నవ్వింది.

"నువ్వేం చేద్దామనుకుంటున్నావు?" అడిగాడు బెనర్జీ.

"ఆయన రమ్మంటే వెళ్ళాలి. వద్దంటే మానాలి."

"అంతే కాని నీకు స్వంత అభిప్రాయాలంటూ ఏం లేవన్నమాట?"

"ఊహూఁ"

"నిన్ను చూస్తే జాలేస్తోంది"

"పెళ్ళయ్యేదాకా నాన్నగారు, తర్వాత మీ అభిప్రాయాలని గౌరవించడం తప్ప నాకు వేరే స్వంత అభిప్రాయాలంటూ ఉండవు ఉన్నా వాటిని ఆదిలోనే తుంచేసుకుంటాను"

"ఏ గుడ్ డాటర్ అండ్ ఏ గుడ్ వైఫ్ అన్నమాట"

"ఉన్నమాటే! మీరెంచక్కా హాయిగా సుఖపడవచ్చు"

చిన్నగా నవ్వి చెప్పాడు బెనర్జీ.

"అది పెళ్ళయ్యేదాకా వాయిదా దేనికి వేయడం? ఈ రాత్రికే -"

ఆమె బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి ప్రవేశించినట్లయింది.

"షటప్" చెప్పింది వెంటనే

మరోసారి చిన్నగా నవ్వాడు బెనర్జీ

కారు సికింద్రాబాద్ క్లబ్ ఆవరణలో ఆగింది. లోపలకి వెళ్ళి రిజిష్టర్ లో తనపేరు, మెంబర్ షిప్ నంబరు రాసి సంతకం చేసాక లోపలికి వెళ్ళారు.

"ఇదేం రెస్టారెంట్?" అడిగింది ఇద్దరూ ఓ విశాలమయిన గదిలో కూర్చున్నాక.

"ఇది పబ్లిక్ వచ్చే రెస్టారెంట్ కాదు. కేవలం నగరంలో కొద్దిమందికి మాత్రమే పరిమితమయిన క్లబ్. ఇందులో సభ్యత్వం పొందిన వాళ్ళనే లోపలికి అనుమతిస్తారు!"

"అలాగా!"

"బార్ అండ్ రెస్టారెంట్ లలా కాదు. ఇక్కడ పేకాడొచ్చు. బిలియర్డ్స్ ఆడచ్చు, టెన్నిస్ ఆడచ్చు, లైబ్రరీలో పుస్తకాలు తీసుకోవచ్చు. డ్రింక్స్ తీసుకుని భోజనం చేయచ్చు. దేనికీ వెంటనే చెల్లించక్కర్లేదు. నెలకోసారి వచ్చి బిల్ పే చేస్తే సరి"

"ఇలాంటివి కూడా ఉంటాయని నాకు తెలీదు" చెప్పింది కొద్దిగా ఆశ్చర్యంగా.

బెనర్జీ ఎప్పటిలా బ్రాంది తీసుకున్నాడు. ఆమె గోల్డుస్పాట్ తాగసాగింది. దాదాపు గంటదాకా రకరకాల కబుర్లు చెపుతూనే ఉన్నాడు బెనర్జీ. తనకి మైత్రంటే ఎంత పిచ్చో చెప్పాడు ఫ్లవర్ షోలో తొలిసారిగా ఆమెని చూసినప్పుడు ఎలా ఫీలయ్యాడో చెప్పాడు.

"ఆర్ద్రత, క్లుప్తత, భావుకత కలిస్తే కవిత్వం అవకాశం, అంగీకారం, అదృష్టం కలిస్తే ప్రణయం. మన విషయంలో ఆ మూడూ 'అ'కారాలు కలుస్తాయో లేదో అని తెగ భయపడ్డాను."

"సారీ! మధ్య తరగతి అమ్మాయిని కాబట్టి ప్రతీసారి మిమ్మల్ని దూరంగా ఉంచుతూ వచ్చాను. నాకు, మా నాన్నగారికి మొదటి నుంచి ధనవంతులంటే భయం. మీరు నన్ను నిజంగా, మనఃస్ఫూర్తిగా ప్రేమిస్తున్నారన్న నమ్మకం నాకు కలిగింది. మా నాన్నగారికి కూడా ఆ సంగతి నచ్చచెప్పగలిగితే చాలు. మీ పేరెంట్స్ రియాక్షన్ మన విషయంలో ఎలా ఉంటుంది?" అడిగింది సందేహంగా.

"మా నాన్నగారికి నా పెళ్ళి విషయంలో ఉన్న అభిప్రాయం చెప్పనే లేదు కదా? సంబంధం ఇచ్చేప్పుడు పెద్ద ఇంటికివ్వాలి, తెచ్చుకునేప్పుడు చిన్న ఇంటినుంచి తెచ్చుకోవాలి అన్నది ఆయన అభిప్రాయం. ఆయన వరకు మన విషయంలో నో అనరు. మా అమ్మ చిన్న ఇంటినుంచి వచ్చిన మనిషే కాబట్టి నో అనలేదు."

ఆమె మొహంలోకి కొత్త కాంతి ప్రవేశించింది. బెనర్జీ లేచి వెళ్ళి వెయిటర్‌తో చెప్పాడు ఇంకో గోల్డుస్పాట్ కావాలని.

"ఈసారి దాంట్లో ఓ లార్జ్ పెగ్ వైన్ కలుపు" చెప్పాడు.

"మేడమ్ కా సార్!" అడిగాడతను.

తల ఊపాడు బెనర్జీ.

గోల్డ్ స్పాట్ తాగాక అడిగింది.

"ఇదేమిటి? ఇంకోలా ఉంది?"

"ఇది ఇంపోర్టెడ్ ఇండియన్ కాదు"

మూడు గోల్డ్‌స్పాట్‌లని తాగాక బాగా మత్తుగా అనిపించసాగింది ఆమెకి. స్వల్పంగా తూలుతూ నడిచింది కారుదాకా. అతని పక్కన ఎప్పటిలా కూర్చోడానికి నిరాకరించింది.

"వెనక సీట్‌లో కూర్చుంటాను" చెప్పింది.

"తప్పు. ముందే కూర్చోవాలి."

"ఉహూ." వెనక తలుపు తెరిచింది.

"నన్ను ఈ కారు డ్రయివర్‌ని చేస్తావా? యజమాని వెనక సీట్‌లో, డ్రయివర్ ముందు సీట్‌లో కూర్చోవడం పద్ధతి. ఫ్రెండ్స్ అయితే పక్కపక్కనే కూర్చుంటారు."

వెనక తలుపు మూసి అతని పక్కన కూర్చుంది. కారు బయలు దేరి క్లబ్ లోంచి బయటకి రాగానే ఆమె నడుం చుట్టూ తన ఎడం చేతిని వేసాడు.

"నో" దూరంగా జరిగింది.

మరో అయిదు నిముషాల్లో కారు ఆమె ఇంటి ముందు ఆగింది. కారు దిగారిద్దరూ. ఆమె హేండ్ బేగ్ లోని తాళం చెవిని తీసి తనే ఇంటి తాళం తీసాడు బెనర్జీ. లోపలికి వెళ్ళాక ఆమెని రెండుచేతులతో పొదవి పట్టుకుని హత్తుకున్నాడు.

"వద్దు" గొణిగింది.

దాదాపు నిముషందాకా గింజుకుంటూనే ఉంది. తర్వాత క్రమంగా ఆ ప్రతిఘటన ఆగిపోయింది. చిన్నగా మూలగసాగింది.

బెనర్జీ తలుపు మూసి లోపల గడియపెట్టాడు. మొదటిసారిగా వారి ఇంటి ముందు గదిలోంచి లోపలికి వెళ్ళాడు.

బయట గులాబి చెట్టుకున్న నల్ల గులాబి గాలికి చిన్నగా కంపించసాగింది.

●●●

ఆమెకి మర్నాడు ఉదయం ఏడున్నరకి మెలుకువ వచ్చింది. తలంతా ఒకటే పోటు, దాహం. మంచినీళ్ళకోసం లేచిన ఆమె తను పూర్తిగా వివస్త్రగా ఉండటం గమనించింది. క్షణకాలం పాలుపోలేదు. తర్వాత నెమ్మదిగా రాత్రి జరిగిన సంఘటనలు ఒక్కొక్కటే గుర్తుకు రాసాగాయి. తను ఇంటికి వచ్చాక... ఆమె మనసు కంపించింది.

బాత్ రూంలోకి వెళ్ళడానికి లేచింది. పక్కమీద పడిఉన్న లంగాని అందుకుంది. దాన్ని తీయగానే దాని అడుగున పక్కమీదున్న తెల్లటి దుప్పటి మీద ఎర్రటి మరకలు కనిపించాయి.

"హే! భగవాన్!"

ఆమె బాత్ రూంలోకి పరిగెత్తి దాదాపు గంటదాకా బిందెలకి బిందెలు నీళ్ళు వంటిమీద కుమ్మరించుకోసాగింది. ఎంతసేపు స్నానం చేసినా తన వంటికి కంటికి కనబడకుండా అంటిన మలినం వదిలిన తృప్తి కలగటం లేదు. చలికాలంలో అంత చల్లటి నీళ్ళని ఎలా పోసుకోగలుగుతుందో కూడా అర్థంకాలేదు.

పదిన్నరకి ఇంటి తలుపు తెరుచుకుని బయటికి వచ్చింది. ఎదురుగా గుమ్మమ ముందు ఓ పూలకుండీ. అది అక్కడికి ఎలా వచ్చింది?

వంగి ఆ చెట్టు ఆకులని ముట్టుకుంది. వెంటనే చెట్టు ఆకులు సిగ్గుపడుతున్నట్లుగా ముడుచుకుపోయాయి.

లాజ్వంతి.

టచ్-మి-నాట్

అత్తిపత్తి.

దాన్ని అక్కడ ఎవరు ఉంచారో ఆమెకి అర్థం అయింది. ఆ పూలకుండీని ప్రక్కకి జరిపి బయటికి నడిచింది.

✷✷✷

*(ఇంకా ఉంది)*

Post your comments